అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 21 జూన్ 2023
1

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత

ఖానాపూర్ : పాఠశాలల అభివృద్ధి వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు పడతాయని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ గ్రామంలో ప్రైమరీ పాఠశాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం నుంచి పల్లెలు మారుతున్నాయన్నారు. 60 సంవత్సారాలు జరగని అభివృద్ధి కేవలం 9 సంవత్సరాల్లో జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హత్యాయత్నం కేసులో రిమాండ్‌లో ఉన్న ఖైదీ మంగళవారం చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై ఉశన్న తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని దార్‌కుబీర్ గ్రామానికి చెందిన బంక మహేష్ హత్యాయత్నం కేసులో నిర్మల్ సబ్ జైలుకు రిమాండ్ అయ్యారు. అక్కడ ఫిట్స్ రావడంతో నిర్మల్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అప్పటికి మెరుగు కాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు ఈ నెల 16న రిఫర్ చేశారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఖైదీ మృతి చెందారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో పంచనామ నిర్వహించి, టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఒలంపిక్ డే రన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు చేపట్టే ఒలంపిక్ డే రన్ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఒలంపిక్ డే రన్ వేడుకలను అదనపు ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులతో కలిసి క్రీడజ్యోతిని వెలిగించి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నిర్వహించిన ఒలంపిక్ క్రీడల వల్లనే విడిపోయిన దేశాలన్ని కలవడం జరిగిందన్నారు. అప్పటి నుండి ఈ ఒలంపిక్ డే రన్ వేడుకల నిర్వహించడం ఆనవాయితీ వస్తుందని తెలిపారు. క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి నింపడంతో పాటు వైషామ్యాలను దూరం చేయడమే ఈ క్రీడ రన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, క్రీడాభిమానులు యునుస్ అక్బానీ, లోక ప్రవీణ్‌రెడ్డి పలువురు పిఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బుచ్చిలింగంకు టీడీపీ శ్రేణుల నివాళి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ బుచ్చిలింగం 4వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి, ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు యం.డి రఫీక్, త్రిమెన్ కమిటీ సభ్యులు గంగసరపు ఓమన్న, పతిహార ప్రభాకర్, రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి గాలిపెల్లి నాగన్న, తెలుగు యువత అధ్యక్షులు సోమ గంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బాను రాజేశ్వర్‌రావు, టిఎన్టీయుసి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా నాయకులు జక్కుల సుభాష్, అశోక్ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఇగ్బాల్పూర్ అంగన్వాడి కేంద్రంలో సూపర్ వైజర్ శ్రీలత చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చంద్రకళ ఉన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రానికి చెందిన బిసి సెల్ ఉపాధ్యక్షులు విజేందర్ తల్లి సోమవారం రాత్రి మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరామర్శించారు. అనంతరం కొత్తగూడ గ్రామానికి చెందిన కాశీరాం కుమారుడు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దేగామ గ్రామానికి చెందిన సాకలి నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, ఏఎంసి చైర్మన్ రుక్మన్‌సింగ్, ఉప సర్పంచ్ విలాస్, నాయకులు డా.చంద్రశేఖర్, డా.అంకుష్, సాయన్న, జగదీష్, కోడారి నరేష్, ఊశన్న, పోశెట్టి, మోహన్, మహబూబ్, రాయలు, చిల్కూరి నరేందర్, సోమన్న పాల్గొన్నారు.

నేటి నుండి డీఎడ్ ప్రవేశాలకు సర్టిఫికెట్ల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎడ్- 2023లో ర్యాంక్ సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులకు డీఎడ్‌లో ప్రవేశం కోసం ఈ నెల 21 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎ.రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21న 1 నుంచి 450 వరకు, 22న 451 నుంచి 900 వరకు, 23న 901 నుంచి 1317 వరకు ర్యాంకు గల అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

కుభీర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అండగా ఉండేందుకే రైతుబీమా పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్డి-బి గ్రామానికి చెందిన కండికే రామ, తూము శంకర్ రైతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో మరణించిన రైతు కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు బీమాను అమలు చేస్తోందన్నారు. దీంతో పాటు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రూ.5వేల రెండు విడతలుగా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మండల అధ్యక్షురాలు తూము లక్ష్మీబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, సర్పంచ్ పుష్పలత, కో ఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు శేరి సురేష్ బాబు, ఉప సర్పంచ్ తుకారాం, వ్యవసాయ విస్తరణాధికారి సాయినాథ్ పాల్గొన్నారు.

కల్తీ మద్యం సూత్రదారులెవరు..?

- కల్తీకి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను బహిర్గతం చేయని అధికారులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్(టి) నియోజకవర్గంలోని దహెగాం మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో నీళ్ల కలిపిన మద్యం బాటిళ్లను సోమవారం హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెల్సిందే. దీనిపై ఎక్సైజ్ అధికారులు ముందుగా ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. తర్వాత ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా మీడియాకు వివరించారు. ఇద్దరు వ్యక్తులు నౌకరినామాగా పేర్కొంటూ తుమ్మిడే కమలాకర్, తోట చందులపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు ముందుగా మీడియాకు వివరించారు. కాని వీరిద్దరిని మీడియాకు బహిర్గతం చేయకుండా అదే దుకాణంలో పని చేసే మరో వ్యక్తిని మీడియా ముందుకు తీసుకువచ్చారు. తుమ్మిడె కమలాకర్, తోట చందులను అప్పటికే ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మద్యం దుకాణంలో తనిఖీ చేసే సమయంలో వీరిద్దరు ఉండడంతో వీరిని అప్పటికప్పుడు అదుపులోకి తీసుకొని కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కాని వీరిద్దరిని మీడియా ముందుకు తీసుకురాకుండా మరో వ్యక్తిని మీడియా ముందు ప్రవేశపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనితో ఈ మద్యం కల్తీ వెనుక ఎవరెవరి హస్తముందనే అనుమానాలు వ్యాపిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలోని ఆయా మండలాలలో మద్యం కల్తీ అవుతున్నట్లుగా ఎప్పటి నుండో ఆరోపణలు ఉన్నాయి. దీనికి తగ్గట్లుగా గతంలో పలు పర్యాయాలు అధికారులకు కల్తీ మద్యం దొరకడం, కేసులు నమోదు కావడం, మద్యం దుకాణాలు సీజ్ కావడం జరిగింది. కాని సోమవారం జరిగిన ఘటన వెనుక మద్యం వ్యాపారుల మద్య విభేధాలు, రాజకీయ కారణాలు ఉండవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మద్యం కల్తీకి పాల్పడ్డ తుమ్మిడె కమలాకర్, తోట చందులను మీడియా ముందుకు తీసుకురాకపోవడంపై, కల్తీ మద్యం సూత్రదారులెవరనే దానిపై ఉన్నతాధికారులు విచారణ చేపడితే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.



దహెగాం మద్యం దుకాణంలో పట్టుబడ్డ కల్తీ మద్యం బాటిళ్లు



దుకాణాన్ని సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం దుకాణం సీజ్ చేసిన అధికారులు

కల్తీ మద్యం బాటిళ్లు దొరికిన దహెగాం మండల కేంద్రంలోని శ్రీచస్వి మద్యం దుకాణాన్ని మంగళవారం ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ కిషన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దుకాణాన్ని సీజ్ చేశారు.

పునరావాసం కల్పించేదెప్పుడు?

- ప్రభుత్వ, సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యం
- పట్టించుకోకుంటే ఓసీ పనులు అడ్డుకుంటాం : దుబ్బగూడెం గ్రామస్తులు



నవతెలంగాణ - కాసిపేట

కల్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో గూడెం గ్రామం ముంపునకు గురవుతుండటంతో పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం,సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కింద పునరావస స్థలం కేటాయించినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళ అక్కడే అనే చందనంగా పనులు జరగడం లేదు. వెంటనే అధికారులు స్పందించి పునరావాస ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు ప్రారంభించాలని, లేకపోతే ఓపెన్ కాస్ట్ పనులను అడ్డుకుంటామని దుబ్బగూడం గ్రామస్తులు ఓరం కవిరాజు, వెంబడి మహేష్, సురేష్, ప్రసన్న, రమేష్ హెచ్చరించారు. మంగళవారం దుబ్బగూడెంలో మాట్లాడుతూ కెకె ఓ సి ముంపు బాధిత గ్రామస్తులకు సింగరేణి యాజమాన్యం, రెవెన్యూ అధికారులు కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొన్ని నెలలుగా ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. పోయినసారి వర్షాకాలంలో కావాల్సిన పనులు మళ్లీ వర్షాకాలం సమీపిస్తున్నా ఇంకా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయన్నారు. సింగరేణి జీఎం, ఆర్‌డిఓ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి, కలెక్టర్ సైతం పట్టించుకోవడం లేదని తెలిపారు. గతేడాది వర్షాలకు ఓసి బ్లాస్టింగ్ తీవ్రతకు 20కి పైగా ఇండ్లు కూలిపోయాయని తెలిపారు. వచ్చే వర్షాకాలం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తోందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలని, లేని పక్షంలో ఓసీ పనులు అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : జీఎం మోహన్‌రెడ్డి

- గని విస్తరణకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-మందమర్రి

ఏరియాలోని కెకె-5 భూగర్భ బొగ్గు గని పనుల విస్తరణకు సంబంధించి మంగళవారం సీఐఎస్ఎఫ్ బ్యారక్‌లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభావిత ప్రాంత గ్రామాల ప్రజలు హాజరై వారి అభిప్రాయాలను తెలిపారు. ప్రభావిత గ్రామాల ప్రజలకు రావాల్సిన అన్ని సదుపాయాలను సంస్థ కల్పిస్తుందని ఆర్‌అండ్‌ఆర్ నిధుల కేటాయింపు, యువతకు ఆర్మీ రిక్రూట్మెంట్, పోలీస్ ఉచిత శిక్షణ తరగతులు, సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు వివిధ విభాగాల్లో ఉచిత శిక్షణ, రోడ్లు, మంచినీటి సౌకర్యం, అన్సులరీ యూనిట్స్ ద్వారా యువతకు చేయూతనిస్తూ అద్దె వాహనాల టెండర్స్ మొదలైన అంశాలలో ప్రభావిత ప్రాంత గ్రామాల్లోని ప్రజలకు సింగరేణి సంస్థ ప్రాధాన్యత ఇస్తుందని జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభావిత ప్రాంత గ్రామాల ప్రజలు అడిగిన విషయాలను సంస్థ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని జీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ బి రాహుల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ జి లక్ష్మణ్ ప్రసాద్, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం మానస, ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కార్మిక సంఘాల ప్రతినిధులు, సర్పంచులు, ముంపు గ్రామాల ప్రజలు, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గని ప్రమాదంలో మరణించిన బండారి రాయలింగు కుమారుడు శివ రామకృష్ణకు కారుణ్య పత్రాన్ని మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి ఉద్యోగి గని ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమని, కుటుంబానికి సింగరేణి సంస్థ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎస్ఓ టు జీఎం, ఎస్ఆర్పి గ్రూప్ గనుల ఏజెంట్ గోపాల్ సింగ్, గని మేనేజర్ విజయ్ కుమార్, డివైపిఎం పాలకుర్తి రాజు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా దినోత్సవం



నవతెలంగాణ-దస్తురాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ విద్యా దినోత్సవం మంగళవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌తో పాటు గొడిసిర్యాల్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఒడిసె పోసవ్వ-మణిక్యరావ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, మన ఊరు మన బడిలో మన పాఠశాల ఎంపికై మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకరమైన తరగతి గది వాతావరణం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల కార్పొరేట్ పాఠశాలను తలపిస్తుందని, చక్కటి ఉపాధ్యాయ బృందం ఉందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, కోట వేణు, చైర్మన్ రాజేందర్, ఎంపీటీసీ మాన్కు, ఉపసర్పంచ్ మణిక్యరావ్, కార్యదర్శి సౌమ్య, వార్డ్ సభ్యులు రామన్న, కొమురయ్య, కిషన్, రామన్న, భూమిక, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, శ్రీదేవి, రాధిక, వెంకట్రాజం, రాజమణి, సత్యం, వరుణ్య పాల్గొన్నారు.

తలమడుగు : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తరగతి గదులలో డిజిటల్ క్లాస్ బోర్డ్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి ఎంపీడీఓ రమాకాంత్ పాఠశాల చైర్మెన్ నేతుల గంగన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలో లేని సౌకర్యాలను ప్రభుత్వాలు కల్పించడం గొప్ప విషయమని అన్నారు. ప్రయివేట్ పాఠశాలలో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. పాఠశాల చైర్మన్ నేతుల గంగన్నను పాఠశాలకు సేవలు అందించి, ఉత్తమ చైర్మెన్‌గా ఎంపికైనందుకు ఘనంగా శాలువాతో సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ చంటి, ప్రధానోపాధ్యాయుడు వినోద్‌రెడ్డి, పశు వైద్యాధికారి దూద్‌రాం, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, రావుల నారాయణ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రత్యేక అధికారి కాడే స్వామి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారులు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి కనక మోతు బాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బలాంపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ప్రతి రోజు ఒక్కరు మాత్రమే హాజరవుతున్నారన్నారని సర్పంచ్ పరమేశ్వర్ ఎంఈఓ ఆశన్న దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ నిధులు ఏ విధంగా విడుదల చేస్తున్నారో తమకే తెలియదని, గ్రామంలో భగీరథ మురికి నీరు రావడంతో గ్రామస్తులు వినియోగించడం లేదని భీంపూర్ సర్పంచ్ రాథోడ్ విష్ణు ఎంపీఈఓను ప్రశ్నించారు. బాతల్‌గూడ గ్రామ పంచాయితీ సొన్నాపూర్‌లో భగీరథ నీరు వారానికి ఒక్కసారి వస్తుందని సర్పంచ్ సుజాత పరమేశ్వర్ అన్నారు. త్రీఫేస్ సమస్యపై విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదని భీంపూర్, జామడ, బేతల్‌గూడ సర్పంచులు విష్ణు, రూపదేవ్, సుజాత పరమేశ్వర్ ఏఈను నిలదీశారు. మూడు నెలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ రమేష్, వైస్ ఎంపిపి చంద్రశేఖర్, పిఎసిఎస్ ఇంచార్జి చైర్మన్ ఆడే సురేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు యూర్వేత రూపదేవ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆధ్యాతిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న చేపట్టబోయే ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బౌద్ధ మహాసభ అధ్యక్షులు శాలిక్‌రావ్ నాగరాడే, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు బాబాసాహెబ్ కాంబ్లే, నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం శేఖర్ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కైలాష్‌నగర్‌లో గల అశోక బుద్ధ విహార్‌లో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సోషల్ వెల్ఫేర్ అధికారులు, డిడి సునీత, ఎస్సీ కార్పొరేషన్ అధికారి మాణిక్‌రావ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 21న ఆధ్యాత్మిక దినోత్సవం పురస్కరించుకొని ఉదయం 9గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, బౌద్ధ గురువులు హాజరువుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఓసీ సంఘాల నాయకులు, బౌద్ధ ఉపాసకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లఘు చిత్ర సీడీనీ ఆవిష్కరించిన జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి పర్యావరణాన్ని కాపాడుదాం అనే లఘు చిత్ర సిడిని మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు పర్యావరణంపై లఘు చిత్రాన్ని తీయడం చాలా సంతోషకరమన్నారు. సింగరేణి ఉద్యోగులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణం రక్షణపైన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు మంచి సందేశాన్ని లఘు చిత్రం ఇస్తుందని, ఈ చిత్రంలో నటించిన నటీనటులు అభినందనీయులని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాస్‌గౌడ్, సీనియర్ పిఓ పి కాంతారావు , కళాకారులు గజ్జెల్లి రాయలింగు, రంజిత్, గడ్డం లక్ష్మణ్, నరేందర్, సంతోష్, విక్రమ్, సదానందం పాల్గొన్నారు.

దళితబంధులో మాదిగ ఉపకులాలకు ప్రాధాన్యత నివ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో టిఎంఆర్పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాట్లాడుతూ రెండో విడత దళితబంధు పథకం మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలలో అత్యధికంగా వెనుకబడిన మాదిగ ఉపకులాలకు అధిక ప్రాధాన్యత ఉండే విధంగా చూడాలని సీఎం కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతి నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిఎంఆర్పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కత్తి గంగాధర్, కొల్హారు స్వామి, లింగంపల్లి రమేష్ పాల్గొన్నారు.

లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫౌండేషన్ పోస్టు 1, ఫిలాసఫీ 1, మ్యాథ్స్ 2, సైన్స్ 1, సాంఘిక శాస్త్రం 1, తెలుగు 1, ఇంగ్లీష్ 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, విజువల్ అండ్ పర్ఫామింగ్ ఆర్ట్స్ 1, కంప్యూటర్ ఎడ్యుకేషన్ 1, ఉర్దూ మీడియంలో ఫౌండేషన్ 1, మ్యాథ్స్ 1, సైన్స్ 1, సాంఘిక శాస్త్రం 1, ఉర్దూ 1 పోస్టులకు ఈనెల 30లో డైట్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎడ్, బీటెక్ విద్యార్హత గల వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యులు మహిమూద్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో



మరణించాడు. మంగళవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు రుక్మాన్ సింగ్, నారాయణరెడ్డి, అమృత్‌రావు పాటిల్, మల్లెపూల సుభాష్, లింబాజి పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న వాచ్ ఉమెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి కస్తూరి శంకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వాచ్ ఉమెన్ బీసీఈ కేటగిరికి చెంది, పదో తరగతి అర్హత కలిగి ఉండాలని, హెడ్ కుక్ పదో తరగతి ఉత్తీర్ణులై, బీసీ(బి) కేటగిరీకి చెందిన వారే ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్ రెండు ఖాళీలకు సంబంధించి ఎస్సీ, బీసీ(ఎ) కేటగిరికి చెంది, ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, మండలానికి చెందిన వారు అర్హులని వారు తెలిపారు. ఆసక్తిగల వారు 25వ తేదీ లోగా స్థానిక కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

విద్యారంగం బలోపేతానికి కృషి

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గురుకులాలు అద్భుతమైన ఫలితాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారయని తెలిపారు. విద్యారంగంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా మారుతోందని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యాదినోత్సవం సందర్భంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో నిర్మల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన రాంనగర్, సోఫినగర్ పాఠశాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతిబాటలో ముందుకు సాగుతున్నదని అన్నారు. తొమ్మిదేండ్లలో ఊహించని విధంగా విద్యాభివృద్ధిలో పురోగతి సాధించదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈఓ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, విద్యాశాఖ అధికారులు, కమిషనర్ సీవీఎన్ రాజు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

నార్నూర్:ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ బడులను సకల సౌకర్యాలతో నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన కొనసాగుతోందని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని గుంజాల గ్రామంలోని మన ఊరు మన బడి కింద పనులు పూర్తయిన ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ కనక మోతుబాయి, స్థానిక సర్పంచ్ కుమ్ర సావిత్రి బాయితో కలిసి ప్రారంభించారు. పాఠశాలలో మంచి నీరు, బిల్డింగ్ రిపేర్, విద్యుత్ కొరకు ప్రభుత్వం రూ.3లక్షల 91 వేలు విడుదల చేసినట్టు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పాత్ర కీలకంగా ఉందని అన్నారు. రూ.26 లక్షలతో పాఠశాలలో 12 రకాల వివిధ పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ బడికి వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందిస్తుందనీ కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఈఈ రాథోడ్ భీంరావ్, ఏఈ సునీల్, ఎంఈఓ ఆశన్న, నాయకులు తిరుపతి, న్యానేశ్వర్, మాజీ సర్పంచ్ కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ రామారావ్, చౌహాన్ దిలీప్, కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మెన్ గణపతి, గ్రామ పెద్దలు కేశవ్, సాంబన్న, జితేందర్, హరిదాస్, అశోక్ ఉన్నారు.

కుభీర్:కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పార్డి(బి) గ్రామ పంచాయతీలో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం, గ్రంథాలయంతో పాటు స్వాగత తోరణాన్ని ఎంపీపీ తూము లక్ష్మీబాయి స్థానిక సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలో 72 పాఠశాలలకు మొదటి విడత కింద 24 పాఠశాలకు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఇప్పటి వరకు 5 పాఠశాలలు పనులు పూర్తి చేసి ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూము లక్ష్మీ బాయి, స్థానిక సర్పంచ్ పుష్పాలత రాజేశ్వర్, మీరా విజయ్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కందుర్ సంతోష్, ఎంఈఓ చంద్రకాంత్, తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీఓ లింబాద్రి, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్, కార్యకర్తలు ఉన్నారు.

నార్నూర్:దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కళాశాలలో, పాఠశాలలో విద్యాదినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జామడ బాలికల ఆశ్రమ పాఠశాలలో, గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలతో పాటు మండలంలోని అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ఉద్యమాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో, కళాశాలలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు శాలువాతో సన్మానించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్, అడ్మిషన్ ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లే, జామడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, విశ్వనాథ్, శివాజీ, పుష్పలత, మల్కు, కేజీబీవీ ఎస్ఓ ప్రియాంక, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఇంద్రవెల్లి:తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. చదువు ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. విద్యా ద్వారానే చీకటిని జయించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బేల:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తేనే మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దవచ్చన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి విశేష ప్రాధాన్యతను ఇస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు.



రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో ఎమ్మెల్యేకు విద్యాశాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని పాఠశాలలో మన ఊరు మన బడి కింద నిర్మించిన అదనపు తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చిన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఎంఈఓ గంగుల శ్రీనివాస్, సర్పంచ్ రాథోడ్ సుమన్‌బాయి, ఎంపీటీసీ జాదవ్ జమునాబాయి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు గంభీర్ ఠాక్రె, కళ్లెం ప్రమోద్ రెడ్డి, సతీష్ పవార్, బండి సుదర్శన్, తన్వీర్ ఖాన్, దత్తు, రాథోడ్ రోహిదాస్, చరణ్ సింగ్, వినోద్ పాల్గొన్నారు.



దిలావర్‌పూర్:తెలంగాణ విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం కేజీబీవీ పాఠశాలలో జెండా ఆవిష్కరణ చేశారు. విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులు, పుస్తకాలు, కాపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నృత్యం, గానం, వాఖ్యానం వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, సర్టిఫికెట్లు, నిఘంటువులు బహుమతిగా అందించారు. 2023 ఎసెస్సీ, ఇంటర్ విద్యార్థులు పాఠశాల స్థాయిలో, మండల స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ విరేష్, తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ మోహన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఓ అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్ :విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాన్ని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ, 2లక్షల 55వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత ఎన్నో నూతన పాఠశాలలు ఏర్పాటు చేసుకొని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని అన్నారు. విద్యార్థులు గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎఎంసీ చైర్మెన్ రుక్మన్ సింగ్, వైస్ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్, స్థానిక జెడ్పీటీసీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్, ఆత్మ చైర్మెన్ సుభాష్, వైస్ ఎంపీపీ లింబాజి, ఎలుక రాజు, రమణగౌడ్ పాల్గొన్నారు.

బోథ్ :దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పిప్పల్‌దరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీపీ తుల శ్రీనివాస్ ముఖ్యఅతిథి హజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఎన్నో గురుకులాలు, పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అలాగే ఎంపీపీ ప్రత్యేక శ్రద్ధతో మండల పరిషత్ నిధులతో రూ.8లక్షల నిధులతో ప్రాథమిక పాఠశాలలోని అదనపు గదిని నిర్మాణం చేసి, ఆదివాసీ గిరిజన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తామని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలను ఆలోచనలకు అనుగుణంగా ఈరోజు మారుమూల గ్రామాల్లో కూడా అన్ని సదుపాయాలతో కూడిన పాఠశాలలను నిర్మించి విద్యా దినోత్సవం నిర్వహించుకుంటున్నారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించినందుకు ఎంపీపీకి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు మహిపాల్, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, కదం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మెన్ ఎంపీడీఓ లక్ష్మణ్, ఎంపీఓ జీవన్‌రెడ్డి, ఎంఈఓ భూమారెడ్డి, ఏపీఎం మాధవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ముధోల్:తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో మంగళవారం విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, కళాశాలల్లో ప్రిన్సిపాల్‌లు జాతీయ జెండా ఎగురవేసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలను అందజేశారు. విద్యాదినోత్సవం సందర్భంగా ఎడ్‌బిడ్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ పాఠ్యాంశాలను ప్రారంభిస్తూ, విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రవిబాబు, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామగౌడ్, గంగాధర్, ఎస్ఎంసీ చైర్మెన్ లక్ష్మీ గ్రామసర్పంచ్ స్వర్ణలత దత్తాద్రి, ఉపసర్పంచ్ ఉదయ్‌కుమార్, సామాజిక కార్యకర్త గురుప్రసాద్, దిగంబర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్:కార్పొరేట్ స్థాయిలో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా సర్కారు పాఠశాలల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యాదినోత్సవ వేడుకలను బంగారిగూడ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మన బస్తీ మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం తరగతి గదుల్లో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన వసతులను పరిశీలించి విద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని చాంద(టి) గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మన ఊరు మన బడి ద్వారా అభివృద్ధి చేసిన పనులకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, డీఈఓ ప్రణీత, మున్సిపల్ కమీషనర్ శైలజ, ఎంపీపీ గండ్రత్ రమేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కుమ్ర రాజు పాల్గొన్నారు.

ముస్తాబైన రీడింగ్ రూమ్

నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో రిండిగ్ రూమ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్ధం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పాత ఐకేపీ రేకుల భవనానికి మరమ్మతులు చేయించి, వివిధ రకాల కలర్లతో అందంగా తీర్చి దిద్దారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో రిండిగ్ రూమ్‌కు మరమ్మతులు చేయుటకు రూ.లక్ష మంజూరు చేశారు. అయితే నిధులు సరిపోకపోవటంతో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోని, నిధులు మళ్లీ సర్దుబాటు చేస్తామని చెప్పటంతో, సదరు కాంట్రాక్టర్ ముత్యంవార్ సంజీవ్ మరమ్మతులు, కలర్, వివిధ రకాల పెయింటింగ్, విద్యుత్ సౌకర్యంతో పాటు వివిధ పనులను పూర్తి చేసి అందంగా రీడింగ్ రూమ్‌ను సిద్ధం చేశారు. దీంతో రీడింగ్ రూమ్ సిద్ధం కావటంతో మంగళవారం ఎంపీడీఓ సురేష్ బాబు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎంపీఓ శిరిషరెడ్డి, పరిశీలించారు. రీడింగ్ రూమ్‌ను బుధవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు.

డెడ్రా గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

హరితహారంలో భాగంగా మండలంలోని డెడ్రా గ్రామపంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఉత్తను గ్రామపంచాయతీగా అవార్డు అందుకుంది. సోమవారం రవీంద్రభారతిలో అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అటవీశాఖ మంత్రులు చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డును ఎంపీడీఓ రాథోడ్ రాధ, సర్పంచ్ భీమ్‌రావు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణలు అందుకున్నారు. డెడ్రా గ్రామపంచాయతీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బృహత్ పల్లెప్రకృతి వనం, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, ప్రతి ఇంటికి కిచెన్ గార్డెన్, గ్రామంలో మొక్కలు పెంచుతూ సంరక్షిస్తూ గ్రామాన్ని పచ్చని హారంలా మార్చడం జరిగిందని తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లా అధికారులు గుర్తించి జిల్లాలోనే ఏకైక గ్రామపంచాయతీ డెడ్రాను ఎంపిక చేసి అవార్డుకు రాష్ట్ర స్థాయికి పంపడం గర్వకారణమని అధికారులను, సర్పంచ్‌ని మంత్రి ప్రశంసించారు. పంచాయతీ కార్యదర్శి కృషి సర్పంచ్ సహకారం ఎంపీడీఓ, ఎంపీఓ మహేందర్‌రెడ్డి నిరంతర పర్యవేక్షణ ప్రజా ప్రతినిధుల సహకారం ద్వారా రాష్ట్రస్థాయి అవార్డు రావడం గర్వకారణం అని గ్రామస్తులు ఈ సందర్భంగా కొనియాడారు.

ప్రజా గోస.. బీజేపీ భరోసా..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు తాగునీటి కోసం పడే ఇబ్బందులపై ఆరా తీశారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. మిషన్ భగీరథ ఓ కమిషన్ భగీరథ అని ఎద్దేవా చేశారు. నల్లా నీరు అందక గిరిజన గ్రామాల్లో బావి, వాగుల్లోని నీటిని తాగుతున్నారని ఆరోపించారు. ఖానాపూర్ పాలకులు ఒక సారి ఈ గూడేల్లో పర్యటించి, తాగునీటి సమస్యను కళ్లారా చూడాలని హితవు పలికారు. రాబోయే రోజుల్లో బీజేపీని ఆశీర్వదించాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ప్రతి గిరిజన గూడెల్లో, స్వచ్ఛమైన తాగు నీటితో పాటు మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్యా నాయక్, అరెల్లి రాజలింగం, ముండే రాజేశ్వర్, గిరి లహాన్ ఉన్నారు.

దళితులను మోసం చేసిన ప్రభుత్వం కేసీఆర్‌దే : వినోద్ నాయక్

నవతెలంగాణ-దస్తూరాబాద్

దళితులను మోసం చేస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన దళితబంధు అప్లికేషన్ భరో కార్యక్రమం పండగలా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి దళితులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకం కేవలం హుజురాబాద్ ఎన్నికల కోసం పెట్టిన పథకమని, అక్కడ ఓడిపోవడం తో పథకాన్ని గాలికి వదిలేశారని అన్నారు. దళితులన్ని సీఎం చేస్తానని మరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం దాదాపు 50 అప్లికేషన్ పత్రాలు నింపి తహసీల్దారుకు అందజేశామని అన్నారు. ఇంత చిన్న మండలంలో ఇన్ని అప్లికేషన్‌లు రావడం దళితుల్లో ఉన్న చైతన్యాన్ని తెలియచేస్తుందని అన్నారు. రాబోయే బడ్జెట్‌లో ప్రవేశ పెట్టె దళితబంధు పథకంలో వీళ్లకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సారి 30శాతం కమిషన్ తీసుకోని ఇస్తే ఊరుకోనేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, దుర్గం సంజీవ్, శంకరవ్వ, కొక్కారకార్ల శంకరయ్య, నితిన్, రంజిత్, అజయ్ పాల్గొన్నారు.

నెలలు గడుస్తున్నా అందని వరిధాన్యం డబ్బులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఓ పక్క రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ, రైతు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, వరి ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మిన ధాన్యం డబ్బులు జమ కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విత్తనాలు వేసుకునే సమయం కావడంతో చేతిలో చిల్లి గవ్వ లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయాలని కోరుతున్నారు.

చేతిలో చిల్లి గవ్వ లేదు...



ధాన్యం అమ్మిన డబ్బులు రాక చేతిలో చిల్లి గవ్వ లేక ఇప్పటి వరకు విత్తనాలు కొనుగోలు చేయలేదు. దుక్కి దున్ని విత్తనాలు విత్తుకొనే సమయం ఇది. ఇకనైనా ధాన్యం డబ్బులు ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాం.

రమణారెడ్డి రైతు పొట్టపెల్లి(కె)

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్లపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు సాజీద్ ఖాన్ మాట్లాడుతూ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలు ప్రతి ఇంటకి చేరే విధంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలు రైతు రుణ మాఫీ చేయడంతో పాటు రుణాలు సైతం మంజూరు చేస్తామని తెలిపారు. రైతులకు ఎకరాకు రూ.15వేలు రైతుబంధు ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గేట్‌లో సీటు సాధించిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోథ్



మండలంలోని పుల్‌సింగ్ నాయక్ తండ గ్రామానికి చెందిన పేద విద్యార్థి ఆడే రూపేష్ ఇటీవల గేట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చి సీటు దక్కించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ రాథోడ్ నూర్ సింగ్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే విద్యార్థిని సన్మానించి మాట్లాడారు. ఉన్నత చదువులకు తన వంతు మరింత సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయనను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



కొత్త మెనూకి బడ్జెట్ చార్జీలు పెంచి, పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ముందు నిరసన తెలిపి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని, పెంచిన వేతనం రూ. 3వేలు అమలు చేయాలని అన్నారు. జులై 10, 11న కలెక్టరేట్ ముందు నిరాహార దీక్షలు జూలై 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు చేస్తామని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిండంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గత విద్యాసంవత్సరం సంబంధించిన కోడిగుడ్ల బిల్లులు 9 నెలలు, పెండింగ్‌లో ఉన్న వేతనం నేటికీ చెల్లించలేదని అన్నారు. గత ప్రభుత్వం పెంచిన వేతనం సంబంధించి జీఓ విడుదల చేసింది. కానీ నెలలు గడుస్తున్న ఆ జీఓను అమలు చేయలేదని అన్నారు. వేతనం పెంచినప్పటి నుంచి నేటి వరకు ఏరియర్స్‌తో సహా చెల్లించాలని అన్నారు. రోజు రోజుకి నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు పెరుగుతున్న పట్టించుకోకుండా ఇప్పుడు కొత్త మెనూని అమలు చేయాలని చెప్తుందని, కానీ మెనూకి తగిన బడ్జెట్ కేటాయించపోవడం చాలా దారుణమని అన్నారు. ఇప్పటికే కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు గ్యాస్ బండ ధర ఆకాశాన్ని అంటుతున్న విద్యార్థుల మెనూ చార్జీలు మాత్రం పెంచడం లేదని అన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు కోట్ల కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నా, ఇప్పటికైనా విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాధా, జిల్లా ఉపాధ్యక్షులు హంస, చీకటి లక్ష్మి, సత్తవ్వ, జిల్లా సహాయ కార్యదర్శి, సాయవ్వ, మనీషా, రాణి, మనీషా, లలిత, రవీంద్ర పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-బేల

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. మంగళవారం మండలంలోని టాక్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామస్తులకు కోర్టు వివాదాలు, పరిష్కార మార్గాలను గురించి వివరించారు. గ్రామంలో ఎవరికైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కార మార్గాన్ని చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గోదావరి, పంచాయతీ కార్యదర్శి గంగన్న, కొండయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ జన్మదినం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఉన్న అనాథాశ్రమంలో మంగళవారం రిటైర్డ్ హైదరాబాద్ కలెక్టర్ శర్మన్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనాధ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి చిన్నారులకు కేకు మిఠాయిలు పంచారు. అనంతరం అనాధ విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అనాథాశ్రమ నిర్వాహకులు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అనాథలని దిగులు చెందక మంచి చదువులు చదివి ఉన్నత స్థాయి ఎదగాలని వారిని ఆశీర్వదించారు. తను ఇదే మండలంలోని మారుమూల గిరిజన గ్రామంలో పుట్టి ఐఏఎస్ అధికారిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా రిటైర్మెంట్ అయ్యానని తెలిపారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.

బుచ్చిలింగంకు ఘన నివాళి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మాజీ మున్సిపల్ ఛైర్మన్ జి బుచ్చిలింగం నాలుగో వర్ధంతిని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దీనికి ముందు స్థానిక పద్మశాలి భవన్‌లో కూడా బుచ్చిలింగం వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్, టీడీపీ నాయకులు సిహెచ్ ప్రభాకర్, గులాబ్‌రావు, ఎల్ మధూకర్, చల్లూరి శంకర్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కుడిక్యాల రాజమౌళితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అడవి సంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-జన్నారం

అడవిని కాపాడుకోవడం, అటవీశాఖ అధికారులతో సహా మండలంలోని ప్రజాప్రతినిధులదేనని ఎఫ్‌డీఓ మాధవరావు అన్నారు. మంగళవారం కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని తాళ్ల పేట, జన్నారం, ఇందన్‌పల్లి, రేంజ్ పరిధిలో ఉన్న అడవిలో జన్నారం జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలతో కలసి పర్యటించి అడవిలో చేసిన పలు అభివృద్ధి పనులను వారికి చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ లో ఉండే జంతువుల దాహార్తి తీర్చడానికి ర్యాంపు వెల్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉపయోగించి బోర్వేళ్లతో నీటి గుంటలను నింపి, జంతువుల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. పర్యాటకుల కోసం వాచ్ టవర్లను నిర్మించి అభివృద్ధి చేశామన్నారు. అడవిలో ఉండే జంతువులను కాపాడటం అటవీశాఖ అధికారులతో పాటు మండల ప్రజా ప్రతినిధులదే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీపతి పద్మా బుచ్చన్న, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, ఎంపీటీసీలు కొంతం శంకరయ్య, జాడి భూమక్క జగన్, దాముఖ కరుణాకర్, కాసెట్టి రాజన్న ఎఫ్ఆర్ఓలు ఆఫీస్ ఉద్దీన్, రత్నాకర్ రావు, సతీష్ పాల్గొన్నారు.

మహార్ కుల సర్టిఫికెట్ ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జిల్లాలో నివాసం ఉంటున్న ఎస్సీలలో 80 శాతం మహార్‌లు ఉన్నారని వారికి మాల కాకుండా మహార్ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్ మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చింతగూడలో ఓ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. గత కొన్ని సంవత్సరాల క్రితం నేతకాని సర్టిఫికెట్ ఇచ్చేవారని. 2000 సంవత్సరం నుండి మాల కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారన్నారు. పొలాల, బులయ్, బుద్ధిజం, అంబేద్కర్ ఇజం, దండరీ సంప్రదాయాలు పాటిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహార్ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చెయ్యవచ్చని స్థానికంగా తహసీల్దార్‌లు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. మహార్ కులం వారికి తహశీల్దార్ దగ్గరనే కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా ఎలాంటి నిబంధనలు లేకుండా ఇచ్చే విధంగా చూడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జాడి శివరాం, ఉపాధ్యక్షుడు పుల్ జల్ విలాస్, సీనియర్ నాయకులు ముంజం రాజేశ్వర్, బెడ్డల చరణ్, రాంటెంకి విలాస్, యువజన నాయకులు ప్రశాంత్, మహార్ గ్రామ అధ్యక్షుడు దుప్ప రమేష్, ప్రధాన కార్యదర్శి రాజు, మహార్ నాయకులు రమేష్ బాబు, పెరుగు గణేష్, పుల్ జల్ మారుతి, జాడి సందీప్, మౌల్కర్ కిరణ్, చపిడి శ్యామ్ రావ్, దహేగాం రవీందర్ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ఆసిఫాబాద్ డీపీఓలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న భక్త ప్రహ్లాద్ బదిలీపై ఆదిలాబాద్‌కు సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ కరిముల్లా ఖాన్ బదిలీపై కరీంనగర్-2కు వెళ్లనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో వారు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగంతో పాటుగా కుటుంబానికి సమయం కేటాయించడం ముఖ్యమని, ఉద్యోగం ఎక్కడ చేసినా క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా చేయడం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు సుధాకర్, రానా ప్రతాప్, పవన్ కుమార్, రమేశ్, ఆర్ఐలు భరత్ భూషణ్, శ్రీనివాస్, కిరణ్, నూతన ఏఓ ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఏ సూపరింటెండెంట్ ఇన్షవ్ అలీ, బి సూపరింటెండెంట్ ఏ.శ్రీనివాస్, ఆర్ఎస్సైలు కిరణ్, సందీప్, పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జైపూర్

మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన వికలాంగులు మంగళారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వికలాంగుల పెన్షన్ రూ.3016 నుండి రూ.4016కు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు పూజరి తిరుపతి, తూండ్ల సాయిలు, మేడి ప్రియాంక్, బోడ లక్ష్మన్ ఉన్నారు.



జైలుకొకరు.. కాటికొకరు..

- మనస్పర్ధలతో జీవితాలను నాశనం చేసుకుంటున్న తల్లిదండ్రులు
- అగమ్యగోచరమవుతున్న పిల్లల భవిష్యత్తు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

- కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన 40 ఏండ్ల భర్త తన భార్య వివాహేతర సంబంధం తట్టుకోలేక ఈ నెల 14న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో అతని భార్యపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ నెల 14న కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు పంపారు. ఒకరు జైలుకు, ఒకరు కాటికి పోవడంతో వారి 15 ఏళ్ల కుమారుడు, 14 ఏళ్ల కూతురు భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారింది. ప్రస్తుతం ఆ పిల్లలు బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్నారు.
- స్థానిక సర్‌సిల్క్ కాలనీకి చెందిన 26 ఏళ్ల వివాహిత భర్త వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 19న మృతి చెందింది. భార్యను తరచుగా అనుమానిస్తూ వేధించడంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ కేసులో ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. రేపో మాపో ఆ భర్త జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వీరి పిల్లలు ఐదేళ్ల పాప, నాలుగేళ్ల బాబుల దీనస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు.
- 20 రోజుల క్రితం ఆదర్శనగర్‌కు చెందిన 40 ఏళ్ల వివాహిత క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మద్యం తాగి వచ్చిన భర్త వేధింపులు భరించలేకే ఈ వివాహిత మృతి చెందినట్లు సమాచారం. వీరి పిల్లలు మాత్రం తల్లి ప్రేమకు దూరమయ్యారు.



ఈ ఘటనలు పరిశీలిస్తే తల్లిదండ్రుల మనస్పర్ధలకు పిల్లలను బలి చేస్తున్నారనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఒక కేసులో భార్య వివాహేతర సంబంధం కుటుంబాన్ని ఛిద్రం చేయగా, మరో కేసులో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త తరచుగా తాగి వచ్చి భార్యను చిత్రహింసలకు గురి చేయడంతో ఆమె తీసుకున్న నిర్ణయం కుటుంబాన్ని నాశనం చేసింది. మద్యం మత్తులో తీసుకున్న నిర్ణయాలు కూడా కుటుంబాలను ఛిద్రం చేస్తున్నాయి. గడిచిన ఏడాది కాలంలో పరిశీలిస్తే పోలీసు స్టేషన్‌లకు వచ్చే కేసులలో అధికం భార్యభర్తల కేసులే ఉంటున్నాయి. ఇందులో ముఖ్యంగా మద్యంతోనే భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడుతున్నాయి. తన భర్త తాగి వచ్చి కొడుతున్నాడని, ఇంట్లో తనను, పిల్లలను వేధిస్తున్నాడని, నా మీద అనుమానపడుతున్నాడంటూ పోలీసు స్టేషన్‌లకు వచ్చే మహిళల సంఖ్య పెరుగుతోంది. ఇది కాస్తా ముదిరి ఆత్మహత్యల వరకు వెళుతోంది.

కౌన్సిలింగ్ ఇచ్చినా ...

పోలీసు స్టేషన్‌కు వచ్చిన భార్యా భర్తలకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినా ప్రయోజనం ఉండడం లేదు. ఎన్ని మనస్పర్ధలు వచ్చినా కలిసుండాలని పోలీసులు చేసే ప్రయత్నాలు అంతగా సఫలమవడం లేదు. పోలీసుల బలవంతం మీద అప్పటికప్పుడు 'సరే'నని వెళుతున్నా తర్వాత కొద్ది రోజులకే మళ్లీ మనస్పర్ధలు ఏర్పడి పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. వారిని జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి పంపించి కూడా కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నారు. అయినా మార్పు రాని దంపతులలో ఎవరో ఒకరు ఆత్మహత్య బాట పడుతున్నారు. ముఖ్యంగా తెలిసీ తెలియని వయస్సులోనే ప్రేమ వివాహాలు చేసుకోవడం కూడా ఇలాంటి ఘటనలకు కారణమవుతోంది. మైనర్‌లుగా ఉనప్పటి నుండే ప్రేమ అంటూ తిరగడం, పెళ్లిళ్లు చేసుకోవడం, తర్వాత కొద్ది కాలానికే మనస్పర్ధలు రావడం, విడిపోవడం ఆనవాయితీగా మారింది. దీనికి కారణం తల్లిదండ్రుల పెంపకం లోపమే కారణం. తమ పిల్లల భవిష్యత్తు పట్ల జాగ్రత్తలు తీసుకోని తల్లిదండ్రులు ఆ దంపతులలో మనస్పర్ధలు వచ్చి జీవితాలను నాశనం చేసుకున్నాక బాధపడుతున్నారు. ఏది ఏమైనా జీవితకాలం కలిసి ఉండాల్సిన దంపతులు క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఏ తప్పు చేయని వారి పిల్లలకు శాపాలుగా మారుతున్నాయి.

పిల్లల ఎదుగుదలపై ప్రభావం : బుద్దె స్వామి, టౌన్ సీఐ, కాగజ్‌నగర్



'క్షణికావేశంలో తల్లిదండ్రులు తీసుకుంటున్న నిర్ణయాలు వారి పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. ఇటువంటి పిల్లల మానసిక స్థితి కూడా సరిగా ఉండడం లేదు. పిల్లల భవిష్యత్తు గుర్తించి భార్యాభర్తలు మనస్పర్ధలు వచ్చినపుడు చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేసుకోవాలి. సమస్య తీవ్రమైనపుడు విడిపోయి వేర్వేరుగానైనా బతకాలి. కాని ఆత్మహత్యలు చేసుకోవడం సరైంది కాదు. ఇంట్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగానే పిల్లలు కూడా అదే బాటలో పయనించే ప్రమాదముంటుంది. 60 నుండి 70 శాతం నేరాలకు మద్యమే కారణం. మద్యం సేవించడం మానేస్తే 50 శాతం నేరాలు తగ్గుతాయి'

పాఠశాల అదనపు గదులు ప్రారంభం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జెల్లి, గూడెం గ్రామాలలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మన ఊరు-మన బడిలో పూర్తయిన పాఠశాల అదనపు గదులను మంగళవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అనేక రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ముందుకు పోతుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వములో సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు-మన బడి కార్యక్రమం తీసుకువచ్చి పాఠశాలల రుపు రేఖలు మార్చడం చాలా గొప్ప విషయమన్నరు, ఆడ బిడ్డల చదువుల కోసం, పేద తరగతి విద్యార్థుల కోసం కేసీఆర్ విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు దుస్తులు రాగి జావా పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులు పెదవులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ డోకే రాజన్న, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు భీంకర్ నారాయణ, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజీం హుసేన్, సర్పంచులు చౌదరి నానయ్య రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగ అవకాశం

- చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అనుబంధంగా నిర్మించనున్న 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌లో ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం సింగరేణి యాజమాన్యంతో మాట్లాడటం జరిగిందని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. మండల పరిధి ఎల్కంటి గ్రామంలో 12.60 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు వాటి అమలు తీరును వివరించారు. అంగన్‌వాడి కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించి ఇస్తుందని, గ్రామీణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుందారం గ్రామంలో రూ.1.56 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించించారు. అనంతరం వేలాల, పౌనూర్ గ్రామాలలో రూ.12.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్, జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవిందరావు పాల్గొన్నారు.

కర్ణాటక తరహా హామీలు అమలు చేస్తాం

నవతెలంగాణ-కోటపల్లి



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కర్ణాటక తరహాలో హామీలు నెరవేరుస్తామని చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ టీపీసీసీ సభ్యుడు నూకల రమేష్ అన్నారు. మంగళవారం ఆయన చెన్నూర్ మండలంలోని చింతలపల్లి, అక్కేపల్లి, శివలింగ పూర్ గ్రామాలలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహిచారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నాడు. ఈ సందర్భంగా నూకల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటుందని అన్నారు. అలాగే మహిళలకు రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పే ప్రభుత్వం కాదని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు బస్సు ప్రయాణంలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కలిగిస్తామని, అలాగే ప్రతి కుటుంబానికి వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తామని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక హామీలతో ప్రజలకు మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకొని కుటుంబ పాలన చేస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క రైతును పట్టించుకున్న పాపన పోలేదని అన్నారు. ప్రజల సమస్యలను నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రజాధనాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తుంటే అన్ని రాష్ట్రాలలో బీఆర్ఎస్ భవనాలను నిర్మిస్తూ మన ప్రజా ధనాన్ని వ్యర్థం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జల అంకగౌడ్, నాయకులు ముత్యాల బాపా గౌడ్, మహేష్ ప్రసాద్ తివారీ, చెన్న సూర్య నారాయణ, దంతెల మదునయ్య, గాలిపెల్లి తిరుపతి పాల్గొన్నారు.

22న కేంద్ర మంత్రి రాక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 22న కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డైరీ శాఖా మంత్రి పురుషోత్తం రూపాల కాగజ్‌నగర్‌కు రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఏకలవ్య పాఠశాల భవనాన్ని కేంద్ర మంత్రి సందర్శిస్తారని వివరించారు. అనంతరం కాగజ్‌నగర్‌లో నిర్వహించే పార్టీ సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

కరపత్రాల, స్టిక్కర్ల విడుదల

ప్రధాని నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలనపై ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లను బీజేపీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను కరపత్రాల రూపంలో ప్రజల వద్దకు తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, కోశాధికారి అరుణ్‌లోయ, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి డోర్ టూ డోర్ సర్వే నిర్వహించాలని, ఓటరు జాబితాలో వివరాల నమోదు కొరకు ఫారం 6, ఓటర్ జాబితాలో వివరాల సవరణ, మార్పులు, తొలగింపుల కొరకు వినియోగించే ఫారాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రాజకీయ పార్టీలు వారి ఏజెంట్లను నియమించుకోవాలని, అధికారులతో కలిసి జాబితా రూపొందించడంలో సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నబెండారా, తమేశ, మండోకార్‌వాడ గ్రామాల్లో నూతనంగా ఏర్పాటుచేసిన పాఠశాలలను కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జడ్పీ ఛైర్‌పర్సన్ కోవలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద పిల్లల కోసం మన ఊరు-మన బడి క్రింద ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచికంచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ బండె తుకారాం, సింగిల్‌విండో ఛైర్మన్ పెంటు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జైపూర్



గ్రామ పంచాయతి పరిధి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పది పరిక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని బోడ అఖిలకు స్థానిక సర్పంచ్ మేడి రవి రూ.5000 ఆర్థిక బహుమతి అందించారు. పాఠశాల ఫస్ట్ సాధించిన విద్యార్థులకు ఆర్థిక బహుమతిగా గతంలో ప్రకటించిన ఆయన మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి నగదు బహుమతిని అందజేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాఠశాల ఫస్ట్ వచ్చిన విద్యార్థిని నగదు బహుమతితో ప్రోత్సహించడం జరిగిందని సర్పంచ్ రవి తెలిపారు. కాగా విద్యార్థిని తండ్రి బోడ వెంకటస్వామి గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా తల్లి తిరుమల కూలీ పని ఆధారంగా చదువుతూ పది పరిక్షల్లో 7.5 గ్రేడ్‌తో స్కూల్ ఫస్ట్‌గా నిల్చిందని ఆయన తెలిపారు. పేద కుటుంబానికి చెందిన అఖిల పై చదువుల కోసం సర్పంచ్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ రూ.516 నగదుగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీసు

నవతెలంగాణ - కౌటాల

గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎంపీఓ మౌనికకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెకు సన్నద్ధమవుతామని తెలిపారు. కాలయాపన చేస్తే ఊరుకునేదిలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నగేష్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఉప రవాణా శాఖ అధికారి డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొజెక్టర్ ద్వారా రోడ్డు ప్రమాదాలు సంభవించే తీరును వివరించారు. నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలను విద్యార్థులకు తెలియజేస్తూ తల్లిదండ్రులు పాటించే విధంగా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు డి.శ్రీనివాస్, రామారావు, ఏఎంవీఐ సంతోష్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బసంత్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన ఊరు మనబడి పథకంలో రూ 10లక్షల 80 వేల మౌలిక సదుపాయాలు, అధునికరణ గదులు, రూ.లక్షతో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్, రూ.6 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేసి మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతిబాటలో ముందుకు సాగుతున్నదని, తొమ్మిదేండ్లలో ఊహించని విధంగా విద్యాభివృద్ధిలో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగాన్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యా బోధన, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, అడెల్లి పోచమ్మ ఆలయ చైర్మెన్ చందు, ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిసెవాసులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం ఆపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇండ్లు లేని నిరుపేదలు రాష్ట్ర వ్యాపితంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని ప్రయోగించడం దుర్మార్గమని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు లంక రాఘవులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మాట్లాడారు. గుడిసెలు వేసుకున్న, పోలీస్ కేసులు బనాయించ బడ్డ పేదలను సందర్శించడానికి ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బస్సు యాత్రను చేస్తే, పోలీసులు బస్సు యాత్రను అడ్డగించి, బస్సు డ్రైవర్‌పైన దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వ భూములను రియల్టర్లు ఆక్రమిస్తుంటే కళ్లప్పగించి చూస్తున్న ప్రభుత్వం పేదలపై దాడులు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పేదలపై నిర్బంధం ఆపాలని, గుడిసెలు వేసుకున్న పేదలందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని అన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్, సీఐటీయూ జిల్లా నాయకులు డి.మల్లేష్, ఆర్.సురేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆశన్న పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ విద్యార్థినుల ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

బాసర : ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో జరుగుతున్న విద్యార్థులు ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు రాగా పోలీసులు ప్రధాన గేటు వద్ద అడ్డుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆత్మహత్యలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై ఎబీవీపీ నాయకుల దాడికి ఖండన

ఆదిలాబాద్‌టౌన్ : కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఎబీవీపీ నాయకుల దాడిని ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయివేటు విద్యాసంస్థ అనుమతి లేకుండా యూనిఫామ్, బుక్స్ అమ్ముతుంటే ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై ఏబీవీపీ నాయకులు స్కూల్ యాజమాన్యానికి మద్దతుగా నిలిచి ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై దాడి చేశారని తెలిపారు. కర్రలతో దాడి చేసి ఎస్ఎఫ్ఐ నాయకులను గాయపర్చారని తెలిపారు. ఫీజులపై, విద్యార్థి సమస్యలపై పోరాడుతూ ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐపై భౌతికంగా దాడి చేయడం పిరికిపంద చర్య, చేతనైతే సమస్యలపై పోరాడాలి కానీ భౌతిక దాడులకు దిగడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎబీవీపీ దాడిని, మేథావులు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థిలోకం ఖండించాలని కోరారు.

వలసవాదుల నుంచి రక్షణ కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చోడ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 118లో గుడిసెలు వేసుకొని సంవత్సరాలుగా నివాసముంటున్న తమకు వలసవాదుల నుంచి రక్షణ కల్పించాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గెడం బాలాజీ జిల్లా అధికారులను కోరారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ స్థలాలు తమకు దక్కేలా చూడాలన్నారు. ఇటీవలి కాలంలో ఈ స్థలాలకు విలువ పెరగడంతో కొందరు తమను బెదిరించి ఆక్రమణలకు యత్నిస్తున్నారని తెలిపారు. సమావేశంలో బాధితులు ఉన్నారు.

ఘనంగా విద్యా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - హాజీపూర్

విద్యా దినోత్సవ సందర్భంగా మండలంలోని పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముల్కల్ల జెడ్పీఎస్‌లో ర్యాలీ, పతాకావిష్కరణ, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ, విద్యార్థుల ఆటపాటలతో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్నారు. దాత సతీష్‌రావు కార్యక్రమంలో పాల్గొన్నారు. దొనబండ, హాజీపూర్, రాపల్లి ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



హాజీపూర్

చింతలమానేపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్య దినోత్సవం ప్రాధాన్యత తెలియజేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఎంపిపి డుబ్బుల నానయ్య, ఎంపిఓ సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆర్ దేవాజీ పుస్తకాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిపి డుబ్బుల నానయ్య గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మారుతి, శ్రీను, రాజయ్య పంచాయతీ కార్యదయాసిఫ్ అలీ పాల్గొన్నారు.



చింతలమానేపల్లి

మందమర్రి : మందమర్రి ఆదర్శ పాఠశాలలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ వేల్పుల రవి, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, హాజీపూర్ మాజీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ హాజరయ్యారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన 15 మంది విద్యార్థులు ఫలితాల కోసం అంకిత భావంతో కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. 2013 నుండి 2023 వరకు పాఠశాల సాధించిన అభివృద్ధిని పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి విద్యార్థులకు వివరించారు.

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో నినాదాలు చేయిస్తూ వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. జెండాలు ఆవిష్కరించి ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను విద్యార్థులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు అందజేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి డిజిటల్ తరగతి గదిని ప్రారంభించారు. గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్‌తో కలిసి ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు.

బొగ్గు సరఫరాపై సింగరేణి, ఎన్టీపీసీ మధ్య కీలక ఒప్పందం

- కర్ణాటకలోని కుడిగీ థర్మల్ కేంద్రానికి ఏటా 67.5 లక్షల టన్నులు
- మహారాష్ట్ర షోలాపూర్ థర్మల్ కేంద్రానికి ఏటా 28.2లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు కుదిరిన ఒప్పందం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్-ఎన్టీపీసీ(నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్) మధ్య దక్షిణ భారత స్థాయిలో బొగ్గు సరఫరాకు కీలకంగా ఒప్పందం కుదిరింది. సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశాల మేరకు సోమవారం సింగరేణి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జే ఆల్విన్ ఆధ్వర్యంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కుదిరిన ఒప్పందాల్లో ఎన్టీపీసీ కర్ణాటకలో నిర్వహిస్తున్న కుడిగీ 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రానికి సింగరేణి సంస్థ ద్వారా ఏడాదికి 67.5 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఒప్పందం కుదిరింది. అదేవిధంగా మహారాష్ట్రలోని షోలాపూర్ వద్ద ఎన్టీపీసీ నిర్వహిస్తున్న 660 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రానికి గతంలో బొగ్గు సరఫరా ఒప్పందాన్ని పెంచుతూ ఏడాదికి 28.2లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేయడానికి మరో మారు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందాలు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశం మేరకు జరిగినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. సాధారణంగా వినియోగదారులు బొగ్గును స్వీకరించిన తర్వాత దానికి సంబంధించిన చెల్లింపులు జరుపుకుంటారు. కాని సోమవారం సాయంత్రం జరిగిన ఒప్పందంలో ఎన్టీపీసీ వారు రామగుండంలో గల తమ ప్లాంట్ సరఫరా చేసే బొగ్గుకు ముందస్తుగా అడ్వాన్స్ చెల్లింపులకు అంగీకరిస్తూ సింగరేణితో మరో ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్టీపీసీ వారు ప్లాంట్‌కు ప్రతి నెలా సుమారు 85 నుండి 90 లక్షల టన్నుల బొగ్గు స్వీకరిస్తుంది. ఇరుపక్షాలకు లాభదాయకంగా ఈ ఒప్పందం ఉండగలదని అధికారులు పేర్కొంటున్నారు. 4వ ఒప్పందం ప్రకారం ఎన్టీపీసీ సంస్థ సింగరేణి నుంచి కొనుగోలు చేస్తున్న మొత్తం 207.7లక్షల టన్నుల బొగ్గును తాను నిర్వహిస్తున్న మూడు ప్లాంట్లలో అక్కడి అవరాన్ని బట్టి ఏ ప్లాంటుకైనా సరే స్వీకరించడానికి, మళ్లించుకోవడానికి అవకాశం కల్పిస్తూ వెసులుబాటుకు అంగీకారం జరిగిందని అధికారులు వెల్లడించారు. ఈ ఒప్పందాల వల్ల సింగరేణి-ఎన్టీపీసీకి కూడా ప్రయోజనం చేకూరనుందని, ఇంధన సరఫరా ఒప్పందాలకు అదనంగా ఈ తరహాలో ఒప్పందాలు జరుగడం సింగరేణిలో ఇదే ప్రథమమని, మార్కెట్ పరిస్థితుల్లో ఇటువంటి ఒప్పందాలు ఇరు వర్గాలకు మేలు చేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏజీఎం మార్కెటింగ్ రాజశేఖర్‌రావు, డీజీఎం శ్రీనివాస్, డీజీఎం కోల్ మూమెంట్ సంజయ్, డీజీఎం మార్కెటింగ్ సురేంద్ర రాజు, అడిషనల్ మేనేజర్ మహేందర్ రెడ్డి, ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఫ్యూయల్ మేనేజ్‌మెంట్ ప్రదీప్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.



డీవీ కృష్ణ వర్ధంతి పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని విద్యానగర్‌లో డి.వి కృష్ణ ప్రథమ వర్ధంతి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సిపిఐ-ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నందిరామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డి.వి.కృష్ణ అరుదైన విప్లవోద్యమ నాయకుడని, ఆయన తన జీవితాంతం విప్లవోద్యమం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో బలమైన బీడీ కార్మిక నిర్మాణానికి కృషి చేశారని, సుమారు 60వేల మందికి పైగా ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)కు ప్రాతినిధ్యం వహించారన్నారు. నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బలమైన సంఘంగా కొనసాగే విధంగా కృషి చేశారని గుర్తు చేశారు. 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబోయే డి.వి.కృష్ణ ప్రథమ వర్ధంతి సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపూర్ సబ్ డివిజన్ నాయకులు జక్కుల రాజన్న, ముప్కే శంకర్, గోరెబాయి, మున్వర్, గోనె లచ్చన్న, నైతం మధు, నైతం భీంరావు, అర్కసోనే రావు, కోరం దేవరావు పాల్గొన్నారు.

అదిలాబాద్‌టౌన్ : ఈ నెల 26న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా వ్యవస్థాపకులు డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు జగన్‌సింగ్ తెలిపారు. మంగళవారం కుమురం భీం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభకు సంబంధించిన కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ తన జీవితాన్ని ప్రజల కోసమే త్యాగం చేశారని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సుభాష్, సాయి, నితిన్, కృపాకర్, రవి పాల్గొన్నారు.

మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మహిత స్వచ్ఛంద సంస్థతో పాటు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి గ్రామీణ క్రీడాకారులను వెలికి తీయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాకాంత్, ఎంపీటీసీ ఎలుగు చంటి, ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ నేతల గంగన్న, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు మురళీ, మహిత స్వచ్ఛంద సంస్థ ట్రైనింగ్ కౌన్సిలర్ రాజేశ్వరి, వాలంటీర్స్ సంధ్య, నిఖిల్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ జిల్లా పరిషత్, మండల పరిషత్ అంకోలి జిల్లా పరిషత్, ఆశ్రమ పాఠశాల, మామిడిగూడ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మహిత స్వచ్ఛంద సంస్థ ఆదిలాబాద్ రూరల్ మండల కోఆర్డినేటర్ పి.ఆదర్శ్ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మానసికంగా కూడా దృఢంగా ఉంటారని తెలిపారు. చదువులోనూ రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు, మహిత స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల : నేటి నుండి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో మండలంలోని గుండాయిపేట్, గుడ్లబోరి, చీపురుదుబ్బ ఫీడర్లకు సంబంధించి మండల కేంద్రంలోని 11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్ధరాత్రి సెల్ ఫోన్ దుకాణంలో దొంగతనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ సెల్ఫోన్ షాపులో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సినిమా రోడ్డు వద్ద గల ఆపిల్ మొబైల్ స్టోర్‌లో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. షాప్ ప్రతి నిత్యంలాగే యజమాని జహిద్ మంగళవారం ఉదయం షాపును తెరిచి చూడగా షాప్‌పై కప్పు టీన్లు తొలగించి ఉండటంతో దొంగతనం జరిగిందని గ్రహించి, పోలీసులకు సమాచారం అందించారు.. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. షాపులోని ఖరీదైన మొబైల్‌లను ఎత్తుకెళ్లినట్లు, వీటి విలువ సుమారు రెండు లక్షలపైగా ఉంటుందని షాప్ యజమాని తెలిపారు. కాగా చోరీ దృశ్యాలు సీసీ పుటేజ్‌లో రికార్డు అయ్యాయి. సెల్ ఫోన్ దుకాణంలో ముగ్గురు బాలలు చోరీ చేసినట్లుగా తెలుస్తుంది. సోమవారం రాత్రి 12:30 ప్రాంతంలో మొబైల్ దుకాణంలోని పైకప్పు రేకులను తొలగించి లోనికి చొరబడి విలువైన సెల్ చోరీ చేసినట్లు సీసీ పుటేజ్ ఆధారంగా తెలుస్తుంది. ఇదే మొబైల్ దుకాణంలో గతంలో కూడా ఇదే విధంగా చోరీ జరిగింది.

మూడు బస్సులు సీజ్

- కార్మికులకు భోజనం ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న మూడు బస్సులను రవాణ శాఖ అధికారులు తనిఖీల్లో మంగళవారం సీజ్ చేశారు. అందులో ప్రయాణిస్తున్న దాదాపు 296 మంది కార్మికులు ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆశ్రయం కల్పించారు. వారికి భోజన వసతిని కల్పించాలని ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి, డీఎం కల్పనలు లయన్స్ క్లబ్ సభ్యులను మంగళవారం కోరారు. దీంతో వారు స్పందించి వారికి భోజనం అందించారు. డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, ఆర్టీసీ ఆర్ఎం, డీఎంతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు వారికి భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ డి.శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రకాంత్, ఏఎంవీఐ మహేష్ ఉన్నారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు(టి) నియోజకవర్గం నుండి కొన్ని రోజులుగా పశువుల అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగుతోందని, అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులు డీఎస్పీ కరుణాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ఈ అక్రమరవాణా వెనుక అధికారపార్టీ నాయకులు, పోలీసుల హస్తముందని ఆరోపించారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షులు శివగౌడ్, గోశాల నిర్వాహకులు విజయ్, నాయకులు వీరభద్రచారి, రవి వర్మ, అరుణ్‌లోయ, సిందం శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌర పఠన మందిరం సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పౌర పఠన మందిరం సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ భీమేశ్ అన్నారు. మండలంలోని ఈదులవాడ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగానికి ఏం చేశారని ఈ దినోత్సవం

నవతెలంగాణ-ఖానాపూర్

విద్యా రంగానికి ఏం చేశారని దశాబ్ది ఉత్సవ విద్య దినోత్సవం జరుపుకుంటున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బానావత్ గోవింద నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో బిఆర్ఎస్ సర్కార్ విద్యారంగానికి చేసింది ఏమీ లేదన్నారు. సీఎం విద్యారంగం పట్ల సమీక్షలు ఎన్నిసార్లు నిర్వహించారో చెప్పాలన్నారు. ఉద్యమ కాలంలో సీఎం కేసీఆర్ పదేపదే ఇచ్చిన కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీ నెరవేరలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్, యూనివర్సిటీలలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ వస్తే కార్పొరేట్ విద్యా సంస్థలను తరిమికొడతామని అన్న కేసీఆర్ వాటికే వంత పడుతున్నారని విమర్శించారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెడతామని 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా కేసీఆర్ సర్కార్ కళ్లు తెరిచి విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం

- జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి
- జిల్లాలో ఘనంగా విద్యా దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి పునరుద్ఘాటించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షతన నిర్వహించిన విద్యా దినోత్సవ వేడుకలకు ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకులాల ఏర్పాటుతో రాష్ట్రంలో పేద మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్య అందుతుందన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 72,000 మందికి ఉచిత నోట్ బుక్స్ అందజేయనున్నట్లు వివరించారు. తొలిమెట్టు కార్యక్రమాల ద్వారా ప్రాథమిక స్థాయిలో విద్యార్థి స్థాయిని గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రాథమిక స్థాయిలో డిజిటల్ బోధన కోసం 575 పాఠశాలలకు గాను 586 ట్యాబులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు నాగేశ్వరరావు, సంతోష్, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రబ్బాని, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ ఆర్సీఓ స్వరూప రాణి, గిరిజన సంక్షేమ శాఖ ఆర్సీఓ గంగాధర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అబూ తాలిబ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యా దినోత్సవం సందర్భంగా ఆదివాసి భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చారిగాం పాఠశాల విద్యార్థులు దీపాలతో చేసిన నృత్యం, కేజీబీవి పాఠశాల విద్యార్థులు చేసిన జానపద నృత్యం అందరినీ ఆకట్టుకున్నాయి. వారిరువురికి జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు రూ.1000 చొప్పున నగదు బహుమతి అందజేశారు.

ఉత్తములకు పురస్కారం

విద్యా శాఖలో ఉత్తములకు ముఖ్య అతిథులు సన్మానం చేశారు. జాతీయ స్థాయి అవార్డు గ్రహీత రంగయ్యతో పాటు రాష్ట్రస్థాయిలో ఉత్తములుగా ఎంపికైన ఉదయబాబు, మధుకర్, వెంకటేశ్వర్, రమేష్, లక్ష్మీనారాయణలను సన్మానించారు.

రాష్ట్ర విద్యాశాఖ బహుమతి ప్రధానం

విద్యా ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రతి జిల్లాకు ముఖ్యులకు పంపించిన బహుమతిని ఉపాధ్యాయులు వారికి అందజేశారు. బహుమతిని అందుకున్న వారిలో జిల్లా జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి, జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా విద్యాధికారి అశోక్‌లు ఉన్నారు. జిల్లాలోని 575 పాఠశాలలకు మంజూరైన 586 ట్యాబులను కూడా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తగినన్ని నిధుల మంజూరుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పాత భవనానికి మరమ్మత్తులు, సెమినార్ హాలు, పూర్తి స్థాయి విద్యుత్ సౌకర్యం, మూత్ర శాలల నిర్మాణాలకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ కళాశాలలో మరిన్ని వసతుల ఏర్పాటుకు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి లక్ష్మినరసింహం, డిప్యుటీ ఈఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చింతగూడలో..

మండలంలోని చింతగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన అదనపు తరగతుల నిర్మాణం, తాగునీటి పంపు, ప్రహరీగోడ, బాత్రూంలను కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే కోనప్పతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, డీఈఓ అశోక్, ఎంఈఓ భిక్షపతి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు ఆత్రం సంజీవ్, లక్ష్మి, కో ఆప్షన్ మహబూబ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ నికురె నాగేందర్, నాయకులు పాల్గొన్నారు.


కాసిపేటలో..

కోటపల్లి : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలుగామ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుల పండుగ కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు రాణి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోటు, పుస్తకాలు యూనిఫామ్, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జన్నారం : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే మండలంలోని పోనకల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూంను ఆ గ్రామ సర్పంచ్ జక్కు భూమేష్ ప్రారంభించారు. అలాగే తపాలాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జీ.తిరుపతి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్స్ బుక్స్ అదజేశారు. తిమ్మాపూర్ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్ పాఠ్యపుస్తకాలను, సర్పంచ్ జాడి గంగాధర్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఎస్ఎంసీ చైర్మన్ బోర్లకుంట శంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలమడుగు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి కట్టా రాజమౌళి, ఎంఈఓ విజయ్ కుమార్, ఉప సర్పంచ్ రాజు గౌడ్, స్వదేశీ రావు పాల్గొన్నారు.

సిఫాబాద్ : జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో ఘనంగా విద్యా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగు రంగుల కాగితాలతో అలంకరించి విద్యా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాటల పోటీ, వ్యాస రచన పోటీ, వకృత్వ పోటీ, రంగోళీ, పెయింటింగ్, ఆటల పోటీ తదితర అంశాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పలు కళాశాలల్లో ప్రథమ సంవత్సరం పరీక్షల టాపర్లను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ శ్రీదర్ సుమన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలను అందించారు. ముత్యంపల్లిలో సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ తిరుపతి, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, కృష్ణ గోపాల్‌రావు, మాధవి లత, అనసూర్య, అర్చన, కాసిపేటలో ఎంపీడీఓ ఎంఏ అలీం, హెచ్ఎం అబ్దుల్ లతీఫ్, దేవాపూర్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఓసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, హెచ్ఎం దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం పాఠశాలల్లో తెలంగాణ విద్యాదినొత్సవం నిర్వహించారు. మండలంలోని బారేగూడ ప్రాథమికోన్నత పాఠశాల, గజ్జిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రభాత భేరి(ర్యాలీ)గా గ్రామంలోని పలు వీధుల గుండా గ్రామ పంచాయతీ వరకూ తెలంగాణ విద్యా దినోత్సవ నినాదాలతో పాటలు పాడుతూ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలు, నోట్ బుక్స్, ఏక రూప దుస్తులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్లే విమల సంతర్, మండల ప్రాదేశిక సభ్యులు వడై సంతోష్, ప్రధానోపాధ్యాయులు తాటి రవీందర్, ఏటుకూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జీఎఫ్. కరుణాకర్ రావు, టీ నాగ గంగాధర్‌రెడ్డి, మహాత్మా సరిత, జీ.సునీత, కే భార్గవి, మనోజ్, అన్నపూర్ణ, వనిత, సునీత, సరస్వతి, నాయకులు గజ్జి రామయ్య, ధర్ని పోచయ్య, తిరుపతి, సురేష్, అనీల్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో..


కాగజ్‌నగర్‌లో..


జన్నారంలో..

కాలువలో పడి ఒకరు మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రానికి చెందిన గోవింద్‌రెడ్డి కుమురంభీం కాలువలో పడి మృతిచెందాడు. మంగళవారం ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిరుపుడి గోవింద్‌రెడ్డి(43) సోమవారం సాయంత్రం మండలంలోని నికాని గ్రామానికి వెళ్లి వస్తానని తన భార్యతో చెప్పి వెళ్లాడు. గోవింద్‌రెడ్డి గత కొన్ని సంవత్సరాల నుండి మండలంలో ఫర్టిలైజర్ దుకాణం నడుపుతున్నాడు. రైతులకు ఇచ్చిన డబ్బులు వసూలు చేయడానికి నికాని గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కెనాల్ ప్రక్కన ప్రమాదవశాత్తు జారిపడిపోయాడు. గోవింద్‌రెడ్డి భార్య వాణి రాత్రి ఇంటికి రాకపోవడంతో భర్త గోవింద్‌రెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కుమురుడు మరో ఇద్దరు వ్యక్తులతో కెనాల్ వెంట వెళు ండగా రాత్రి కొమురంభీం కెనాల్ ప్రక్కన తన మోటార్ సైకిల్ కనిపించడంతో స్రావన్, డోకె సంతోష్ కెనాల్‌లో పడి మృతిచెంది ఉన్నట్టు ఆయన తెలిపారు. అనంతరం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు. మృతిపట్ల తమకెలాంటి అనుమానం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

డిజిటల్ బోధనతో కార్పొరేట్ విద్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిజిటల్ బోధనతో ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్య అందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌టీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్)ను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాల ప్రవేశపెడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం మొదటి విడతలో జిల్లాలో ఎంపికైన పాఠశాలలలో అభివృద్ధి పనులు దాదాపు తుది దశకు వచ్చాయని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రోత్సహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగేల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ ఆలి బిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు అహ్మద్, జిల్లా సెక్టోరల్ అధికారులు జంబోజు సత్తయ్య, సుభాష్, భరత్ పాల్గొన్నారు.

సరిహద్దుల మధ్య భద్రత చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంతర్ రాష్ట్ర సరిహద్దుల మధ్య సమన్వయంతో భద్రత చర్యలు చేపడదామని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. చంద్రాపూర్ జిల్లా ఎస్పీ రవీంద్ర సింగ్ పరదేశితో చంద్రపూర్ జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్‌లో సమావేశమయ్యారు. ముందుగా జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ కు ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, సరిహద్దుల ద్వారా ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని అరికట్టాలని అన్నారు. తెలంగాణలో మరి కొద్ది నెలల్లోనే ఎన్నికలు ఉండటం, సరిహద్దుల వద్ద భద్రత చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేయడం గురించి చర్చించారు. ప్రాపర్టీ దొంగతనాలకు సంబంధించిన కేసులు, ఇతర నేరాలు చేసే ముఠాలను పట్టుకోవడం, ఇతర కేసులను సత్వరం పరిష్కరించుకోవడంలో సహకరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్ నగర్ డీఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ సుధాకర్, వాంకిడి సీఐ శ్రీనివాస్, కౌటాల సీఐ సాదిక్ పాషా పాల్గొన్నారు.

సీఐగా పదోన్నతి పొందిన రమేష్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసిఫాబాద్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ, సీఐగా పదోన్నతి పొందిన రమేష్‌ను మంగళవారం కేస్లాపూర్ హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రమేష్ పట్టణంలో ఎంతో మంచి సేవ చేశారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శిరీష్ శర్మ, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, డా.రమేష్, గోపాల్ నాయక్, గుండా వెంకన్న, గడ్డల వెంకన్న, బాపురావ్ పాల్గొన్నారు.